క్లుప్తంగా

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



రాంపాలెంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలు

గోపాలపురం: మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెం గ్రామంలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపాలెం బాలింక చెరువులో అదే గ్రామానికి చెందిన మందపాటి శ్రీను అనే వ్యక్తి అక్రమంగా మట్టిని తవ్వి విక్రయిస్తున్నట్టు ఇరిగేషన్ అధికారులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై దర్యాప్తు జరిపి ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

గోపవరం గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌ను అభినందిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

నిడదవోలు రూరల్: గోపవరం గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండా స్తూపాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన దుర్గేష్‌ను టీడీపీ, జనసేన నాయకులు అభినందించి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ పంచదార దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు ఆరేపల్లి చిననంగాలు, ఆరేపల్లి దుర్గా శ్రీను, జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు అడ్డగర్ల కృష్ణ, నాయకులు తోలేటి సిల్వా, బండారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



సమిశ్రగూడెంలో ఏర్పాటు చేసిన బెంచీల వద్ద స్థానిక నాయకులు, క్లబ్ సభ్యులు

నిడదవోలు రూరల్: ఆధ్యాత్మిక ప్రదేశాలు, ప్రధాన కూడళ్లలో వృద్ధులు సేద తీరేందుకు అనువుగా రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెంలోని చింతచెట్టు వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. రూ.2లక్షల దాతల సహకారంతో నిడదవోలు పరిసర ప్రాంతాల్లో 57 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, పోలదాసు శ్రీనివాసరావు, యాసరపు రామకృష్ణ, గుంటుపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి నాగేశ్వరరావు, దేశాబత్తుల నాగు, స్థానికులు పాల్గొన్నారు.

శ్రావణం వరకూ మోగని పెళ్లి బాజాలు

- ముహూర్తాలకు మూఢం అడ్డంకి
- జూలై 8 వరకూ శుక్రమూఢం
- ఆపై ఆషాఢం శూన్యమాసం
- ఆగస్టు 7 తర్వాతే వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు
- మళ్లీ సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 3 వరకూ శూన్యమాసం



కొవ్వూరు: ఈ ఏడాది ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి బాజాలకు బ్రేక్ పడింది. ఏప్రిల్ 28 నుంచి వరుసగా మూఢమి రావడంతో రెండున్నర నెలలుగా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాల వంటి శుభకార్యాలు నిలిచిపోయాయి. క్రోధి నామ సంవత్సరం ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీ చైత్ర మాసం వరకూ శుభ ముహూర్తాలు నడిచాయి. ఏప్రిల్ 28వ తేదీ చైత్ర చవితి ఆదివారం నుంచి జూలై ఎనిమిదో తేదీ వరకూ ఆషాఢ శుద్ధ తదియ వరకూ శుక్ర మౌఢ్యమి (మూఢం) నడుస్తోంది. మే 7 నుంచి చైత్ర బహుళ చతుర్దశి మంగళవారం నుంచి జూన్ ఏడో తేదీ వరకూ గురు మౌఢ్యమి నడిచింది. వరుసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా వివాహాలకు ఆటంకం ఏర్పడింది. మరో వైపు జూలై ఐదో తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభం అవుతుంది. ఆషాఢ మాసం ఆగస్టు ఐదో తేదీ వరకూ కొనసాగుతుంది. ఇది శూన్యమాసం కావడంతో ఈ నెలలో కూడా వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాల వంటి శుభకార్యాలు నిర్వహించరు. మొత్తం మీద ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకూ పెళ్లి బాజాలు మోగే అవకాశం లేదని పండితులు, పురోహితులు చెబుతున్నారు. మూఢంలో కేవలం అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్ల వంటి పనులకు మౌఢ్యమిలోని మంచి రోజుల్లో చేసుకోవచ్చునని పండితులు సూచిస్తున్నారు. సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకూ బాద్రపదం కూడా శూన్యమాసం కావడంతో ఈనెలలో వివాహాల ముహూర్తాలు ఉండవు.

శ్రావణ మాసంలోనే..

శ్రావణ మాసం ఆగస్టు ఏడో తేదీ నుంచి ప్రారంభమై 28వ తేదీ వరకూ నడుస్తుంది. ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఆగస్టు ఏడో తేదీ నుంచి 28 వరకూ ముహూర్తాలు ఉన్నాయి. వాటిలో 5,12,13,19, 20, 26, 27 తేదీల్లో శుక్ర, మంగళవారాలు మినహా అన్నీ రోజులూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

వందలాది మంది ఉపాధికి గండి

గత రెండున్నర నెలలుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి కావడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కేవలం వివాహాలపై ఆధారపడి ఎన్నో వృత్తుల వారు జీవనం సాగిస్తున్నారు. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవాళ్లు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్ కార్లు, బస్సులు, ఐస్‌క్రీమ్‌లు, మినరల్ వాటర్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు, పూలు, డెకరేషన్స్, లైటింగ్, కూరగాయలు, కిరాణా, వస్త్ర, బంగారు, వెండి వ్యాపారాలు, షామ్యానాలు, మాంసపు దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులకు పని లేకుండా పోయింది. మరెంతో మంది రోజువారీ కూలీలకూ ఉపాధి కొరవడింది. అడపాదడపా చిన్నచిన్న ఫంక్షన్లు వస్తున్నా పెళ్లిళ్లు అయితే సరైన గిరాకీ లభిస్తుందని ఆయా వర్గాల వారు చెబుతున్నాయి.ఆగస్టు ఏడో తేదీ వరకూ మళ్లీ ఎదురు చూపులు చూడాల్సిందేనని పేర్కొంటున్నారు.

శ్రావణంలో దివ్యమైన ముహూర్తాలు



గురు, శుక్ర మౌఢ్యాలు వరుసగా రావడంతో వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాలు 70 రోజుల పాటు నిలిచిపోయాయి. ఏప్రిల్ 28 తర్వాత వివాహాలకు ఇంత వరకు మళ్లీ ముహూర్తాలు లేవు. శ్రావణ మాసంలో ఆగస్టు 7 నుంచి 28 వరకూ నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి.సెప్టెంబర్‌లో మళ్లీ భాద్రపద మాసం శూన్యమాసం కావడం వలన వివాహ ముహూర్తాలు ఉండవు.

– వారణాసి హనుమంతశర్మ, రాష్ట్ర పురోహిత సంఘం అధ్యక్షుడు, కొవ్వూరు

కొవ్వూరుపాడు విద్యార్థినికి మూడు బహుమతులు



తాను పొందిన బహుమతులతో విద్యార్థిని లీలా సంతోషి

గోపాలపురం: రాజమహేంద్రవరం రోటరీ యూత్ యాక్టివిటీస్ వేడుకల్లో భాగంగా ఆ నగరంలో మే 17,18,19 తేదీల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో కొవ్వూరుపాడు జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థిని కనుమూరి లీలాసంతోషి విశేష ప్రతిభ కనబరిచి పలు బహుమతులు గెలుచుకుంది. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో లీలా సంతోషి ద్వితీయస్థానం, వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం, స్పాట్ స్పీకింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్టు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం డి. శేషారత్నం ఆదివారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని రోటరీ రివర్ సిటీ ఆవరణలో ఈనెల 7న విజేత లీలా సంతోషికి బహుమతులు అందజేశారని తెలిపారు. మూడు విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి స్వామి వివేకానంద జీవిత విశేషాలతో కూడిన పుస్తకం, రూ.2500 నగదును బహుమతిని అందజేసినట్టు వివరించారు.

పాఠశాల జ్ఞాపకాలు ఎప్పటికీ మధురమే



తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: పాఠశాల రోజుల్లో చోటు చేసుకున్న ఘటనలు బాల్య స్నేహితులకు మరుపురాని మధుర స్మృతులే. తాళ్లపూడిలోని పరస పద్మరాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. 25 ఏళ్ల క్రితం కలిసి చదువుకుని, అనంతరం విడిపోయి వివిధ రంగాల్లో స్థిరపడిన పాత్ర మిత్రులందరూ అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఉదయం నుంచీ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, నాటి మధురానుభూతులను నెమరు వేసుకుంటూ సాయంత్రం వరకూ ఉల్లాసంగా గడిపారు.

కల్మషం లేని స్నేహానికి పాఠశాల దశే మంచి వేదిక అని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ సందర్భంగా నాడు తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కుటుంబ సభ్యులను తమ మిత్రులకు పరిచయం చేశారు. ఆనాటి ఉపాధ్యాయులు సీహెచ్ ఆంజనేయులు, సుబ్బారావు, చామర్తి విశ్వనాథరావు, రిటైర్డ్ లైబ్రేరియన్ రామారావులను ఘనంగా సత్కరించారు. తామంతా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు జి. గోపాలకృష్ణ, టి. సత్యనారాయణ, టి.దుర్గా శ్రీను, కె.వెంకటరమణ, టి.విష్ణు తదితరులు పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టులు పునరుద్ధరించాలి

కొవ్వూరు: కరోనా విపత్తుకు ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్ నిలిపే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఇటీవల పునరుద్ధరించిన పూరి–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని వారు పేర్కొన్నారు. తమ వంతు బాధ్యతగా ఈ ఎక్స్‌ప్రెస్‌పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల రైల్వే స్టేషన్‌లో రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు స్థానిక ఆంధ్ర షుగర్స్ కంపెనీ వినతిపత్రం సమర్పించడం ఆనందదాయకం అని సమితి సభ్యులు పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు వెంపా విల్సన్ రాజు, పడాల సుబ్బారెడ్డి, గోవర్ధన శ్రీనివాసమూర్తి, తాతయ్య బాబు, హాజీబు, జగన్నాథరావు, వైకే శ్రీనివాస్ తదితరులు ఆంధ్రా షుగర్స్ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు.



ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టులు పునరుద్ధరించాలని కోరుతున్న రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

సొసైటీల చైర్‌పర్సన్లు, డైరెక్టర్ల రాజీనామా

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ సొసైటీల త్రిసభ్య కమిటీల చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను సొసైటీ కార్యదర్శులకు అందజేసి వాటిని తక్షణమే ఆమోదించాలని కోరారు. సొసైటీల చైర్‌పర్సన్లు వింతా గంగాధర్ రెడ్డి (కోరుమామిడి), చింతా రాంబాబు (తాడిమళ్ల), గుంటుపల్లి కృష్ణమూర్తి(కాటకోటేశ్వరం), యాళ్ల రామారావు (శంకరాపురం), పెన్మెత్స చందు (సింగవరం), గంధం వెంకటరత్నం (శెట్టిపేట), గజ్జరపు శ్రీరమేష్ (సమిశ్రగూడెం), సుంకవల్లి శ్రీహరి(పురుషోత్తపల్లి) ద్రోణంరాజు వెంకట శ్రీరామారావు (డి.ముప్పవరం), శీలంశెట్టి సూర్యనారాయణ (పందలపర్రు), చేకూరి చంద్రరాజు (పెండ్యాల)తో పాటు డైరెక్టర్లు రాజీనామాలు సమర్పించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు సేవలందించేందుకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడికి, సహకరించిన రైతులకు, అధికారులకు త్రిసభ్య కమిటీల చైర్‌పర్సన్లు డైరెక్టర్ త్రిసభ్య కమిటీల చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీసత్యకు 2,402 వ ర్యాంకు



నితేష్ శ్రీసత్య

నల్లజర్ల: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో నల్లజర్లకు చెందిన పెండెం నితేష్ శ్రీసత్య అఖిలభారత స్థాయిలో 2,402 ర్యాంకు సాధించాడు. ఓబీసీఎన్సీఎల్‌లో ఈ ర్యాంకు 399గా ఉంది. నితేష్ శ్రీసత్య తండ్రి దుర్గాప్రసాద్ దూబచర్ల ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇంగ్లిషు లెక్చరర్‌గా పనిచేస్తుండగా తల్లి ఝాన్సీలక్ష్మి అనంతపల్లి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయిని. ఇంజినీర్ కావాలన్నదే తన ఆశయమని ఈ సందర్భంగా శ్రీసత్య తెలిపాడు.

నిర్మలగిరికి టీడీపీ శ్రేణుల పాదయాత్ర

దేవరపల్లి: రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించడంతో పాటు గోపాలపురం నియోజకవర్గం నుంచి మద్దిపాటి వెంకట్రాజు గెలిచిన సందర్భంగా దేవరపల్లి మండలం యర్నగూడెం నుంచి గౌరీపట్నం మేరీమాత నిర్మలగిరి పుణ్యక్షేత్రానికి టీడీపీ శ్రేణులు ఆదివారం పాదయాత్ర చేశారు. టీడీపీ నాయకులు పెన్మత్స సుబ్బరాజు, ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లిన విజయభాస్కర్ ఆధ్వర్యంలో టీడీపీ ఎస్సీ యూత్ సభ్యులు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాకలపాటి వెంకటగిరి, ఎలిపెం మహేంద్ర, జుత్తుక నాగరాజు, మరపట్ల పెద్దిలియ్య, బేదంపూడి మహాలక్ష్మయ్య, నక్క సోసిబాబు, గుమ్మడి గౌతం, గుడే ముత్యాలు, కొర్రపాటి నాని, పాముల రాజేష్, గుమ్మడి చిరంజీవి, దాయం శ్రీను, బుంగ శివ, మెంటెం శ్రీను, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కొండపాడులో ముగిసిన అమ్మవార్ల జాతర





మార్కొండపాడు గ్రామదేవతలు ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ వార్లు



బందపురం గ్రామ దేవత ముత్యాలమ్మ

చాగల్లు: మార్కొండపాడు గ్రామదేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ వార్ల జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర మహోత్సవాలను మూడు రోజుల పాటు పాటు వైభవంగా నిర్వహించారు.శ నివారం రాత్రి పూరిగుడిసె వద్ద గల అమ్మవారికి బలిచేట నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ఆలయం వద్దకు తీసుకు వచ్చి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రముఖులు, బంధువులు, రాకతో గ్రామం సందడిగా మారింది. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ఎస్సై పి.నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

బందపురంలో ముత్యాలమ్మ జాతర

దేవరపల్లి: మండలంలోని బందపురం గ్రామదేవత ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి అమ్మవారి జాతర నిర్వహిస్తారు. 2012లో జాతర నిర్వహించగా, మళ్లీ ఈ ఏడాది అమ్మవారి జాతరకు గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. మే 12న అమ్మవారిని ఆలయం నుంచి గ్రామ నడివీధికి తీసుకు వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూరి గుడిసెలో ఉంచి నిత్యం పూజలు చేస్తున్నారు. ఇంటింటికీ అమ్మవారి ఘటాలను తీసుకు వెళ్లి పూజలు చేస్తున్నారు. ఈ నెల 15,16 తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహిస్తారు. 15న రాత్రి బలిచేట, 16న నైవేద్యాల కార్యక్రమంతో జాతర మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

నల్లజర్ల: స్థానిక క్రేజీ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు వేసవిలో స్థానిక విద్యార్థులకు నెల రోజుల పాటు ఉచితంగా వివిధ నాట్య ప్రదర్శనల్లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ చివరిలో వారికి పోటీలు కూడా నిర్వహించారు. శిక్షణ ముగింపు సందర్భంగా తాము నేర్చుకున్న నృత్య రూపకాలు, నృత్య ప్రదర్శనలతో ఆదివారం నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో ప్రదర్శించారు. ఏడాదిగా నల్లజర్లలోని తమ సంస్థలో చిన్నారులకు వెస్టర్న్, క్లాసికల్, భారతీయ సంప్రదాయ నృత్య ప్రదర్శనలలో శిక్షణ ఇస్తున్నట్టు డ్యాన్స్ మాస్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఢీ షో రైటర్ నాని ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల శాఖ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, యోగా గురువు రాజారావు, నెక్కంటి వెంకటేశ్వరరావు, టీచర్ తాతారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మురుగు కాలువలకు మోక్షం

- దేవరపల్లిలో పూడిక తొలగింపు
- రూ. 5 లక్షల మండల పరిషత్ నిధుల మంజూరు



అంబేడ్కర్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు వరకూ పూడిక తీసిన డ్రైన్



దేవరపల్లిలో పూడిక తీసిన ఇసుక వాగు మురుగునీటి కాలువ

దేవరపల్లి: దేవరపల్లిలో మురుగునీటి కాలువ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టారు. దాదాపు 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఇసుక వాగులో పూడికతీసి అభివృద్ధి చేశారు. యాదవోలు రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వంతెన వరకూ గల ఇసుక వాగు ముళ్లపొదలు, చెత్తతో నిండి ఉంది. దీనివల్ల మురుగు ముందుకు ప్రవహించక వెలువడే దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ నడిబొడ్డున ఇసుక వాగు ఉండడంతో డ్రైనేజీ దుస్థితిని చూసి ప్రజలు ముక్కున వేలేసుకునేవారు. ఇసుక వాగు అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రభుత్వం నుంచి జిల్లా పరిషత్ మైనింగ్ నిధులు రూ.1.10 కోట్లు మంజూరు చేయించారు. నిధులు మంజూరై ఏడాది అయినా పనులు చేపట్టలేదు. దీంతో మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు గ్రామంలోని ప్రధాన డ్రైనేజీల పూడికతీతకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇసుక వాగు, అంబేద్కర్ సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు వరకు, దళితవాడల్లోని పలు డ్రైనేజీల్లో పూడికతీయించి, అభివృద్ధి చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, మూడు రోడ్ల కూడలి ప్రాంతం ముంపునకు గురై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తగా డ్రైనేజీలను అభివృద్ధి చేసినట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారులు మద్దిపాటి, నామాన, నాళం శ్రీనివాసరావు

కొవ్వూరు: లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ఆ క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు కలగర వెంకట్రావు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శిగా నామాన బుల్లిరాజు, కోశాధికారిగా నాళం వెంకట శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా యాగంటి చలపతిరావు, మొదటి ఉపాధ్యక్షుడిగా పిల్లలమర్రి మురళీకృష్ణ, రెండో ఉపాధ్యక్షుడిగా ఎండీ హుస్సేన్, మూడో ఉపాధ్యక్షుడిగా గూడపాటి వెంకట సత్యశివ ప్రసాద్, మెంబర్ షిప్ చైర్మన్‌గా పెనుమాక జయరాజు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా పాలెంపాటి చినబాబు చౌదరి, సర్వీస్ చైర్‌పర్సన్‌గా కంఠమణి రామకిషోర్, మార్కెటింగ్ కమ్యూనికేషన్స్ చైర్‌పర్సన్‌గా ముళ్లపూడి కాశీ విశ్వనాథ్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా పూర్వ అధ్యక్షులంతా పని చేస్తారన్నారు.

రాజీనామా చేసిన ఇళ్ల భాస్కరరావు

గోపాలపురం: మండలంలోని రేగులగుంట గ్రామానికి చెందిన రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు ఆ పదవికి రాజీనామా చేసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకే అమరావతిలోని బీసీ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి తన రాజీనామ పత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా పంపించినట్టు భాస్కరరావు పేర్కొన్నారు.